ముంచేసిన కొండ గోదారి

- 2,500 హెక్టార్లలో వరి పంట మునక
- ఆందోళనలో రైతులు

సీతానగరం: మండలంలోని సుమారు 2,500 హెక్టార్లలోని వరిపంటను కొండ గోదారి ముంచేసింది. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా కొండగోదారి పోటెత్తింది. దీంతో పురుషోత్తపట్నం, రామచంద్రపురం, సింగవరం, చినకొండేపూడి, రాపాక, రఘుదేవపురం, నల్గొండ, మిర్తిపాడు, ముగ్గళ్ల, ఇనుగంటివారిపేట, వెదుళ్లపల్లి, మునికూడలి, కాటవరం, బొబ్బిల్లంక తదితర గ్రామాలలో వరిపంటకు తీవ్ర నష్టం కలిగింది.

కొండ గోదారి ఎగపోటు

సీతానగరం, గోకవరం, కోరుకొండ మండలాలలో కొన్ని గ్రామాలలో కురిసిన వర్షం నీటితో పాటు సూరంపాలెం ప్రాజెక్టు నుంచి విడుదల చేసిన మిగులు జలాలన్నీ బురద కాలువ ద్వారా బొబ్బిల్లంక కాలువకు చేరుకుని గోదావరిలో కలుస్తాయి. ఈ ప్రవాహాన్నే స్థానికంగా కొండ గోదారి అని పిలుస్తారు. ఈ నీరంతా బొబ్బిల్లంక స్లూయిజ్ గేట్ల నుంచి గోదావరిలో కలుస్తుంది. అయితే నాలుగు రోజులుగా గోదావరి ఉధృతంగా ఉండడంతో బొబ్బిల్లంక వద్ద స్లూయిజ్ గేట్లు ఆటోమేటిక్ గా మూసుకుపోయాయి. దీంతో కొండ గోదారి ప్రవాహం గోదావరిలో కలిసే అవకాశం లేకుండా పోయింది. దీంతో ఆ నీటితో వరి పొలాలు ముంపులోకి వెళ్లాయి.

పంటనష్టం మంజూరు కాదా..

మండలంలోని సుమారు 2,500 హెక్టార్లలో వరి పొలాలు ముంపు బారిన పడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులు పంట నష్టం పొందాలంటే వరినాట్లు వేసి 40 రోజులు పూర్తవ్వాలి. కానీ మండలంలో వరినాట్లు వేసి సుమారు 30 రోజులే అయ్యింది. దీంతో నష్ట పరిహారంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.


మిర్తిపాడులో మునిగిన వరి పొలాలు


సీతానగరంలో ఉద్యాన పంటలను పరిశీలిస్తున్న ఉద్యానశాఖాధికారి రినీ

వరిఆకు దొరకడం కష్టమే

ముంపులోకి వెళ్లిన వరిపంట ఏమవుతుందో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒకవేళ పంట దెబ్బతింటే రైతులకు వరిఆకు దొరకడం కష్టంగా మారుతుంది. ఇప్పటికే ఎకరానికి రూ.10 వేల నుంచి రూ.18 వేల వరకూ పెట్టుబడి పెట్టారు. వీటితో పాటు 150 ఎకరాలలోని కూరగాయల పాదులు, కూరగాయల పంటలకు నష్టం కలిగింది.

150 ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం

భారీ వర్షాల కారణంగా మండంలోని 150 ఎకరాలలో ఉద్యాన పంటలకు నష్టం కలిగిందని ఉద్యానశాఖాధికారి రినీ అన్నారు. ఆమె సోమవారం సీతానగరం, సింగవరం, చినకొండేపూడిల్లోని దెబ్బతిన్న దొండ, బీర పాదులు, ఇతర కూరగాయల పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. పొలాల్లో నిల్వ ఉన్న నీటిని సాధ్యమైనంత త్వరగా బయటకు పంపించే మార్గాలను చూడాలన్నారు. వర్షాలు ఆగిన వెంటనే 19:19:19 లేదా 13:0:45 లేదా యూరియా వంటి పోషకాలను ఆకులు తడిచే విధంగా పంటపై పిచికారీ చేయాలన్నారు. నేల కొంచెం ఆరిన తర్వాత తెగుళ్ల, కుళ్ల నివారణకు బ్లెటాక్స్ లేదా ప్లాంటామైసిన్ మందును లీటర్ నీటిలో మూడు గ్రాములు కలిపి మొదలు తడిచేలా పిచికారీ చేయాలన్నారు. కాకర, బీర, సొర పంటల్లో బూజు తెగులు నివారణకు మెటాలాకిల్స్, మ్యాంకోజెబ్ మందులను కలిపి లీటర్ నీటిలో 2 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. అరటిలో 100 గ్రాముల యూరియా, 80 గ్రాముల ఎం పొటాష్‌ను రెండు లేదా మూడు సార్లు 25 రోజుల కాల వ్యవధిలో వేయాలని తెలిపారు. ఆమె వెంట ఉద్యాన విస్తరణాధికారి సౌమిత్ర, వీహెచ్ఏ ఆశిక, ప్రియ ఉన్నారు.

పది ఎకరాలు పాడైంది



పది ఎకరాలలో వేసిన వరిపంట కొండ గోదారి ముంపులోకి వెళ్లింది. ఎకరానికి రూ.30 వేలు శిస్తుగా చెల్లించాను. అలాగే సుమారు రూ.15 వేలు పెట్టుబడి పెట్టాను. తిరిగి వరినాట్లు వేయాలంటే వరి ఆకు దొరకడం కష్టమవుతుంది. మమ్మల్ని ప్రభుత్వం ఆదుకోవాలి.

– కోనే శ్రీనివాసరావు (ఇంద్ర), కౌలు రైతు, చినకొండేపూడి

పూర్తిగా నష్టపోయా



ఐదు ఎకరాలలో వరిపంట వేశాను. కొండ గోదారితో ముంపులోకి వెళ్లింది. నీరు లాగాలంటే ఎక్కువ రోజులు పట్టేలా ఉంది. దీంతో వరిపంట కుళ్లిపోతుంది. ఎకరానికి రూ.15 వేలు ఖర్చు చేశాను. అందిన కాడిని అప్పులు చేసి కౌలుకు తీసుకున్నాను. వరి నాట్లు వేసి ఇరవై రోజులు కాకుండానే ముంచేసింది.

– తంబాల చంద్రరావు, కౌలురైతు, ఉండేశ్వరపురం

ప్రభుత్వం ఆదుకోవాలి



ఏడు ఎకరాలలో వరి, ఆరు ఎకరాలలో కూరగాయల పాదులు పెట్టాను. అధిక వర్షాలకు కొండ గోదావరి ఎగపోటుతో ముంపులోకి వెళ్లాయి. పాదులు పూర్తిగా పాడైపోయాయి. వరి పంట ముంపులోనే ఉంది. అంతా కౌలు పొలమే. ఇప్పటి వరకు రూ. 2 లక్షలు పెట్టుబడి పెట్టాను. మమ్మల్ని ప్రభుత్వం ఆదుకోవాలి.

– గౌరైల తంబారావు, కౌలురైతు, చిన వంగలపూడి

క్లుప్తంగా

గ్రామ దేవతలకు బోనాలు


ఉండేశ్వరపురంలో బోనాలు సమర్పిస్తున్న భక్తులు

సీతానగరం: మండలంలోని ఉండేశ్వరపురం గ్రామ దేవతలకు సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో బోనాలు సమర్పించారు. గ్రామ దేవతలైన ముత్యాలమ్మ, గంగాలమ్మ, మసలమ్మ, బూరమ్మ అమ్మవార్లకు సమరసత ఫౌండేషన్, మహిళా విభాగం ఆధ్వర్యంలో సమర్పించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో శిక్ష సప్తాహ్


సూర్యారావుపేట పాఠశాలలో నిర్వహించిన టీఎల్ఎం మేళా

రాజానగరం: విద్యార్థులలో దాగిన సృజనాత్మకతను గుర్తించి, ప్రోత్సహించే దిశగా విద్యాశాఖ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో శిక్ష సప్తాహ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎంఈఓలు రామన్నదొర, జ్యోతిప్రసాద్ తెలిపారు. వారం రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మొదటిరోజు సూర్యారావుపేట పాఠశాలలో ఏర్పాటు చేసిన టీఎల్ఎం మేళాను వారు సందర్శించి, ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. ప్రతి పాఠశాలలోనూ ఈ నెల 29 వరకూ ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

ఘనంగా సాయిబాబా గ్రామోత్సవం


ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో కోదండ రామాలయం సన్నిధిలోని ఆలయంలో ఉన్న సాయిబాబాను సోమవారం గ్రామంలో ఊరేగించారు. గ్రామస్తులంతా కలిసి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. గురు పౌర్ణమిని పురస్కరించుకుని బాబాను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. కార్యక్రమంలో వైజాగ్ అబ్బు, పాలచర్ల రామకృష్ణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ


బాధిత కుటుంబీకులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: అనపర్తి మండలంలోని పీరా రామచంద్రపురం గ్రామంలో ఇటీవల తేతలి రామయ్యమ్మ మరణించారు. దీంతో ఆమె భర్త తేతలి సుబ్బారెడ్డి, కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సోమవారం పరామర్శించారు. అలాగే కొత్తూరు గ్రామంలో మరణించిన మేడపాటి సరస్వతి కుటుంబ సభ్యులను, బిక్కవోలు మండలంలోని బలభద్రపురం గ్రామంలో చనిపోయిన మండ సత్యనారాయణరెడ్డి, మేడపాటి వెంకటరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వెంట పలువురు నాయకులు పాల్గొన్నారు.

శాకంబరి అలంకరణలో దుర్గాదేవి


అనపర్తిలో శాకంబరిగా దుర్గాదేవి

పెదపూడి: అనపర్తిలోని మార్కండేయపురం భావన రుషి ఆలయంలో కొలువుదీరిన దుర్గాదేవి అమ్మవారు సోమవారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఆలయ అర్చకుడు రాము శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త కానూరు కృష్ణ అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


ఎంపీడీఓ వెంకటరత్నం

రంగంపేట: గ్రామ సచివాలయాల పరిధిలో ఈ నెల 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకూ నిర్వహించే ఆధార్ నమోదు కేంద్రాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ పి.వెంకటరత్నం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని సచివాలయాల్లో ఐదు రోజుల పాటు ఆధార్ నమోదు కేంద్రాలను నిర్వహిస్తామన్నారు. ఆయా సచివాలయాల పరిధిలోని పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు ఆధార్ సేవలు అందిస్తారన్నారు. కొత్తగా ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్‌డేట్ తదితర సేవలు అందజేస్తారన్నారు. ఈనెల 23న ఎస్టీ రాజాపురం, చంద్రేడు, 24న ఈలకొలను, పెదరాయవరం, 25న వీరంపాలెం, పాత వీరంపాలెం, రంగంపేట, 26న జి.దొంతమూరు-1, 2, సుభద్రంపేట, 27న ముకుందవరంలో, వడిశలేరు, 23న కోటపాడు, 24న మర్రిపూడి, 25న సింగంపల్లి, నల్లమిల్లి, 26న దొడ్డిగుంట, 27న వెంకటాపురం గ్రామాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు నిర్వహించనున్నామన్నారు.

మధురపూడి: కోరుకొండ మండలంలో మంగళవారం నుంచి ఈనెల 27 వరకూ ఆధార్ మొబైల్ శిబిరం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ హేమ సుందరరావు తెలిపారు. సచివాలయాలు, హైస్కూళ్లలో ఈ కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

మహిళకు పాము కాటు

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామానికి చెందిన కోసూరి నూకాలు అనే మహిళ తన ఇంటి ఆవరణలో శుభ్రం చేస్తుండగా పాము కాటేసింది. దీంతో స్థానికులు ఆమెను గ్రామంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించడంతో ప్రాణాపాయం తప్పింది.

సులభతరంగా విద్యా బోధన సాగాలి


కుతుకులూరు ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఎంఓ గౌరీ శంకర్

పెదపూడి: విద్యార్థులకు బోధన ఉపకరణాలు ఉపయోగించి సులభతరంగా, అర్థవంతంగా విద్యాబోధన సాగాలని తూర్పుగోదావరి జిల్లా విద్యాశాఖ ఏఎంఓ గౌరీశంకర్ అన్నారు. ఆయన అనపర్తి మండలం కుతుకులూరు, మహేంద్రవాడ తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను సోమవారం సందర్శించారు. పాఠశాలల్లో ప్రారంభించిన శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గౌరీశంకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన జాతీయ విద్యా విధానం ప్రారంభించి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-1, 2 సత్తిరెడ్డి, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా టీఎల్ఎం

మధురపూడి: కోరుకొండ మండలం కోటికేశవరం న్యూ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్ఎం) బోధన అభ్యాసన సామగ్రి ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన పలు అంశాలను ప్రదర్శించారు. ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బహుమతులు అందజేయనున్నారు. హెచ్ఎం తనకాల వెంకట భగవానులు ఆధ్వర్యంలో జరిగిన ప్రదర్శనలో ఉపాధ్యాయులు తనకాల రమాదేవి, మర్రా మౌనిక పాల్గొన్నారు.

శిక్షా సప్తాహ్ ప్రారంభం

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. తొలి రోజు విద్యార్థులు, ఉపాధ్యాయులు సంయుక్తంగా తయారు చేసిన వివిధ రకాలైన చార్టులు, నమూనాలు తదితర బోధన సామగ్రిని ప్రదర్శించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మల్లిపూడి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత విద్యా విధానంలో బోధన సామగ్రి పాత్ర అద్వితీయమన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని ఈ నెల 28వ తేదీ వరకూ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పడాల ఈశ్వరరెడ్డి, అప్పారావు, వలీషా, లక్ష్మణరెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధిక వర్షాలతో వరి పంటకు తీవ్ర నష్టం

- ముంపులోనే పొలాలు
- పరిశీలించిన అధికారులు
- రైతులకు సూచనలు

మధురపూడి: వరద కారణంగా ముంపు బారిన పడిన వరి పంటకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖ జిల్లా అధికారి మాధవరావు అన్నారు. కోరుకొండ మండలం శ్రీరంగపట్నం, మునగాల గ్రామాల్లోని ముంపు పొలాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మండలంలో 3,300 ఎకరాల విస్తీర్ణంలో వరిని సాగు చేస్తుండగా, వరదల కారణంగా 1,920 ఎకరాలు మునిగిపోయిందన్నారు. అయితే ఏడు రోజుల వరకూ మడుల్లో నీరున్నప్పటికీ పర్వాలేదన్నారు. నీటిని మొత్తం తీసేసిన తర్వాత సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. దుబ్బు బలపడటానికి, పంట పెరుగుదల కోసం జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పిలకలు పట్టడం కోసం 20 కిలోల యూరియా 15 కిలోల పొటాష్ చల్లాలన్నారు. పొడ తెగులు నివారణకు దుబ్బులపై వారిడామైసిన్, హెగ్జాకొనజోల్ 2 మిల్లీమీటర్ల తెగులు మందును ఒక లీటరు నీటికి కలిసి పిచికారీ చేయాలన్నారు. అయితే వర్షపు నీటి కారణంగా సూక్ష్మ పోషకాలుంటాయన్నారు. దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ ఏడీ మల్లికార్జునరావు, కోరుకొండ మండలాధికారి ఏ.గౌరీదేవి ఉన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

రాజానగరం: అల్పపీడన ప్రభావంతో నాలుగు రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలకు మండలంలో 450 హెక్టార్లలో వరి పంటకు నష్టం వాటిల్లిందని మండల వ్యవసాయాధికారి (ఎంఏఓ) షేక్ ఇమామి ఖాసిమ్ తెలిపారు. వర్షాలు ఆగకుండా కురుస్తూనే ఉన్నందున ఈ నష్టం మరింత పెరిగే అవకాశం కూడా ఉందన్నారు. మండలంలో పంట నష్టానికి గురైన పొలాలను సోమవారం పరిశీలించారు. పొలాలలో నిలిచిపోయిన ముంపు నీరు త్వరితగతిన దిగువకు పోయేందుకు తీసుకోవాల్సిన చర్యలతో పాటు ఆ తరువాత చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు.

కోరుకొండ మండలంలో..

మధురపూడి: కోరుకొండ మండలంలో వరిపంట ముంపునకు గురైంది. గోదావరి ఎగపోటు, బురద కాలువ ముంపు కారణంగా ఈ పరిస్థితి ఏర్పడింది. మండలంలో 3,300 ఎకరాల విస్తీర్ణంలో వరి పంట సాగు చేయగా, 2,500 ఎకరాల విస్తీర్ణంలోని పంట మునిగిపోయింది. గోదావరి వరదనీరు ఎగపోటుతో జగన్నాథపురం, బుచ్చెంపేట, మధురపూడి, బూరుగుపూడి, గాడాల, దోసకాయలపల్లి, నర్సాపురం, కణుపూరు, గాదరాడ, రాజవరం, కోటికేశవరం, బొల్లెద్దుపాలెం గ్రామాల్లో ఆకు మడులు మునిగి పోవడంతో వరినాట్లు జరగలేదు. అలాగే బురదకాలువ కారణంగా పల్లపు ప్రాంత గ్రామాలైన శ్రీరంగపట్నం, మునగాల, కోరుకొండ, కోటి, కాపవరం గ్రామాల్లోని పంట పొలాలు మునిగాయి.


శ్రీరంగపట్నంలో రైతులకు జాగ్రత్తలు తెలియజేస్తున్న వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మాధవరావు


ముంపు బారిన పడిన పంట పొలాలను పరిశీలిస్తున్న రాజానగరం ఎంఏఓ ఖాసిమ్


శ్రీరంగపట్నంలో నీట మునిగిన పంట పొలాలు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


పెదపూడిలో స్వచ్ఛతా ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీఓ ఆశాజ్యోతి

పెదపూడి: ప్రతిఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ పి.ఆశాజ్యోతి సూచించారు. పెదపూడి గ్రామంలో స్వచ్ఛ వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్వచ్ఛతా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన గ్రామాల నిర్మాణానికి గ్రామాల్లో పారిశుధ్య చర్యలు మరింత మెరుగు పరచాలన్నారు. దోమల నివారణకు మందు పిచికారీ చేయాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. ప్రజలందరూ కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, సచివాలయ కార్యదర్శి మన్యం శ్రీనివాసు చౌదరి, సర్పంచ్ కలవల కృష్ణమూర్తి, ఉపాధ్యాయుడు గిరి తదితరులు పాల్గొన్నారు. అలాగే దోమాడ, కరకుదురు, రామేశ్వరం, చింతపల్లి, శహపురం, చింతపల్లి తదితర గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు.

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక ప్రధాన రైల్వేస్టేషన్‌లో రూ.1.50 కోట్లతో చేపట్టిన ట్రాక్ ఆధునీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేసి, ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని రైల్వే అడ్వైజరీ కమిటీ మెంబర్లు రైల్వే అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం స్టేషన్ అడ్వైజర్ కమిటీ మెంబర్లు యానాపు ఏసు, పీవీ సుబ్రహ్మణ్యం తదితరులు ఆ పనులను పరిశీలించారు.

పునరావాస కేంద్రానికి తరలి రండి

- ములకల్లంక వాసులను కోరిన తహసీల్దార్
- సున్నితంగా తిరస్కరించిన గ్రామస్తులు

సీతానగరం: గోదావరి మధ్యలో ములకల్లంక గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుంది. వరద ఉధృతి పెరుగుతుండడంతో ప్రమాదం పొంచి ఉంది. ఈ నేపథ్యంలో బొబ్బిల్లంకలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేస్తామని, అక్కడకు తరలిరావాలని ములకల్లంక వాసులను అధికారులు కోరుతున్నారు. కానీ ఆ గ్రామస్తులు మాత్రం సున్నితంగా తిరస్కరిస్తున్నారు. సోమవారం ఆ గ్రామంలో తహసీల్దార్ నెల్సన్ పాల్‌బాబు, మండల స్పెషల్ ఆఫీసర్ రామ్ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ డి.బాలశంకరరావు, డీఈ రవి, ఏఈ అవినాష్ పర్యటించారు. తహసీల్దార్ మాట్లాడుతూ అన్ని సౌకర్యాలతో పునరాస కేంద్రం ఏర్పాటు చేస్తామని, లేదా మీ బంధువులు ఉంటే వారి ఇళ్లకు వెళ్లవచ్చని ప్రజలకు సూచించారు. గోదావరి వరద మరింత ఎక్కువ అవుతుందని హెచ్చరించారు. కాగా... డ్యూటీ డీఎంహెచ్‌వో ఎం.శ్రీహరిబాబు బొబ్బిల్లంకలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని సందర్శించారు. బొబ్బిల్లంక రేవును బీజేపీ నియోజకవర్గం అసెంబ్లీ కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరి సందర్శించి ఏటిగట్టు పలు ప్రాంతాల్లో బలహీనంగా ఉందని, ఇరిగేషన్, ఏజీఎల్‌బి శాఖాధికారులు తగు చర్యలు చేపట్టాలన్నారు.


ములకల్లంకలో మహిళతో మాట్లాడుతున్న తహసీల్దార్ నెల్సన్ పాల్‌బాబు

కౌలు కార్డు.. అందరికీ అందేదెప్పుడు?

- ఈ ఏడాది నిర్దేశిత లక్ష్యంలో వెనుకబాటు
- 22,008 కార్డుల లక్ష్యానికి గాను 9,362 మాత్రమే మంజూరు
- కేవలం 42.55 శాతం మాత్రమే కార్డుల జారీ

రంగంపేట: భూమిని కౌలుకు తీసుకుని సాగు చేసే రైతులకు సాగుదారులుగా గుర్తింపు లేకపోతే తీవ్ర నష్టం కలుగుతుంది. కౌలు కార్డులు ఉన్నవారికే ప్రభుత్వం అందించే సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, ఇన్‌పుట్ సబ్సిడీ, భూసార పరీక్ష, ఈ-క్రాప్ నమోదు, పంటకు బీమా, యంత్ర పరికరాలకు రాయితీ, కిసాన్ క్రెడిట్ కార్డులు వంటి అనేక ప్రయోజనాలు అందుతాయి. అంతటి కీలకమైన కౌలు రైతు ధ్రువీకరణ పత్రాల(సీసీఆర్‌సీ) జారీలో ఈ ఏడాది తీవ్ర జాప్యం జరగడంతో సగానికి సగం మంది కౌలు రైతులకు తిప్పలు తప్పడం లేదు.



కౌలు రైతులకు మద్దతుగా నిలిచేలా

కౌలు రైతులకు మద్దతుగా నిలిచేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కౌలుదారీ చట్టం-1956ను రద్దు చేసి ఆంధ్రప్రదేశ్ పంట సాగుదారుల చట్టం-2019 తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారం భూయజమాని హక్కులకు ఎలాంటి నష్టం లేకుండా సాగు చేసే కౌలు రైతులకు పంట సాగుదారు కార్డు ఇవ్వాలని నిర్ణయించింది. సాగు చేసే కౌలు రైతులకు పంట రుణంతో సహా అన్ని ప్రభుత్వ పథకాలు పొందడానికి వీలుగా సాగుదారుల కార్డులు మంజూరు చేసేవారు. గతేడాది ఖరీఫ్‌కు ముందుగానే అంటే ఏప్రిల్‌లోనే సాగు గుర్తింపు కార్డులు జారీ చేశారు. అయితే ఈ ఏడాది ఖరీఫ్‌లో ఇప్పటికే జులై నెల నాలుగో వారానికి వచ్చేస్తున్నా నేటికీ కౌలు కార్డుల జారీ ఆశించిన మేర జరగలేదు. అనపర్తి నియోజకవర్గంలోని 58 గ్రామాల్లో రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది గ్రామ సభలను నిర్వహించి కార్డులు జారీ చేస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఈ ఏడాది 22,008 కార్డుల జారీ లక్ష్యంగా నిర్ణయించినా 9,362 మంది రైతులకు మాత్రమే సాగుదారు కార్డులు అందజేశారు. నిర్దేశించిన లక్ష్యంలో కేవలం 42.55 శాతం మాత్రమే కార్డులు ఇవ్వడంతో కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కార్డుల జారీ ప్రక్రియలో జాప్యం జరిగిందని అధికారులు చెబుతున్నారు. అధికారులు సాగు కార్డుల జారీని వేగవంతం చేసి అర్హులందరికీ అందించాలని కౌలు రైతులు కోరుతున్నారు.

నియోజకవర్గంలో మండలాల వారీగా మంజూరైన కార్డుల వివరాలు

మండలం	లక్ష్యం	మంజూరు చేసినవి
అనపర్తి	4800	2098
రంగంపేట	5200	1992
బిక్కవోలు	6200	2144
పెదపూడి	5808	3128
మొత్తం	22,008	9,362

ఎన్నికల కారణంగా ఆలస్యం



గతేడాది మే నెల నుంచి సాగుదారు కార్డులు జారీ చేశాం. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల కారణంగా కౌలు కార్డుల జారీ ఆలస్యమైంది. ప్రస్తుతం కౌలు గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియ జరుగుతుంది. రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందికి సూచనలు జారీ చేశాం. కొత్తగా ఎవరైనా సాగుదారు కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి మంజూరు చేయాలని ఆదేశాలిచ్చాం.

– కె.శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి, రంగంపేట

అనపర్తి చేరిన ఆలిండియా పాదయాత్రికుడు


పాదయాత్ర చేస్తున్న యువకుడు నగేష్

పెదపూడి: ఆలిండియా పాదయాత్ర తలపెట్టిన విజయవాడకు చెందిన యువకుడు నగేష్ ఆదివారం అనపర్తి చేరుకున్నారు. రాత్రికి అనపర్తిలో బస చేసి సోమవారం ఉదయం 7.30 గంటలకు అక్కడ నుంచి బయలు దేరి బిక్కవోలు, పెదపూడి మండలాల మీదుగా కాకినాడ చేరుకుని పూరి బయలుదేరి వెళ్లనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ తాను భారతదేశమంతా పాదయాత్ర చేయాలనేది తన లక్ష్యమన్నారు. ప్రతి పది కిలోమీటర్లకు కొన్ని రకాల మొక్కల విత్తనాలు నాటుతున్నానన్నారు. పర్యావరణ పరిరక్షణ కాపాడటానికి తన వంతు ప్రయత్నం చేస్తున్నానన్నారు. తన పాదయాత్రను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో తన యూట్యూబ్ చానల్‌లో పోస్ట్ చేస్తున్నానన్నారు. పాదయాత్రలో ప్రజలు చూపిస్తున్న అభిమానం మరువలేనిదన్నారు.

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

రంగంపేట: అధిక వర్షాలపై మండల అధికారులందరూ అప్రమత్తంగా వ్యవహరించాలని మండల ప్రత్యేకాధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన అన్ని శాఖల మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అధిక వర్షాల దృష్ట్యా ప్రజలకు, పంటలకు, పశువులకు ఏ విధమైన నష్టం వాటిల్లకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో అంతర్గత రోడ్లు, పంటలు ఏవైనా ముంపునకు గురైతే వెంటనే ఉపాధి హామీ కూలీలతో నివారణ చర్యలు చేపట్టాలన్నారు.